సమాచారం

నేడు ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

రాయదుర్గం: గోపన్‌పల్లిలో మంగళవారం ఎల్లమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అన్నసమారాధన ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మియాపూర్: ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు లింగంపల్లి వద్ద నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా చందానగర్ మెయిన్‌రోడ్డు, బీహెచ్ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

క్లుప్తంగా...

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

గచ్చిబౌలి: రాయదుర్గంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రాయదుర్గం- ప్రశాసన్‌నగర్ రోడ్డులో జరుగుతున్న మోడల్ కారిడార్, స్ట్రీట్ ఫర్నిచర్ ప్రాంతాలు, ఫుట్‌పాత్ పనులను జీహెచ్ఎంసీ ఈఎన్‌సీ మహ్మద్ జియావుద్దీన్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు .పనుల్లో నాణ్యతతో పాటు త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు .ఈ పర్యటనలో జెడ్సీ శంకరయ్య, ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్, డీఈ రమేష్, సీపీ మల్లికార్జున్, ఏడీసీ మెహ్రా, ఎన్‌సీసీ, హెచ్ఎడీఏ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప ఆలయ నిర్మాణానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.2లక్షల విరాళం సోమవారం అందజేశారు. అనంతరం పనులను ఆయన పరిశీలించారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మధు తెలిపారు. బీరప్ప, శ్రీకాంత్‌యాదవ్, యాదగిరి, నారాయణ పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి'



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పాటి- ఘణపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని విశ్వహిందు పరిషత్ ధర్మ ప్రచార రాష్ట్ర కోకన్వీనర్ సుభాష్ చందర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఆశిష్‌గౌడ్ అన్నారు. సోమవారం పాటి గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీజేవైఎం, బజరంగ్‌దళ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ఉపేందర్

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటారు. ఆదివారం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ముత్తంగి విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం, సర్పంచ్ ఉపేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు అభినందించారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ మమత, వివిధ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. శంకుస్థాపనలు చేసిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న పనులను సైతం పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీ పనులు చేపట్టే ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. పనులు పెండింగ్‌లో ఉంటే నిధులు వెంటనే కేటాయించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ మమత, డీసీలు రవికుమార్, రవీందర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

◆ ఫతేనగర్ డివిజన్‌లో రూ.65లక్షలతో అభివృద్ధి పనులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లో రూ.65లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలోని శ్మశానవాటికలు, పార్కులు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని అన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. బేగంపేట శ్మశానవాటిక నిర్మాణ పనులు దాదాపు 90శాతం పూర్తయ్యాయని తెలిపారు. నగరంలో అత్యాధునిక సదుపాయాలతో చేపట్టిన శ్మశానవాటికి ఇదే అని పేర్కొన్నారు.

◆ అమృత తండా ప్రాంత పరిశీలన...

నిరుపేదలు నివసించే అమృత తండా ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ ప్రాంతంలోని నిరుపేదలకు సరైన నివాస గృహాలు లేవని వారందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

◆ చిత్తారమ్మ బస్తీ నిర్వహణ సమస్యను పరిష్కరించాలి

డివిజన్ పరిధిలోని చిత్తారమ్మ బస్తీ ఆవరణలో స్థానికులు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కట్టించి బస్తీ నిర్వహణకు షాపులను కేటాయించామన్నారు. కానీ అద్దెకు ఎవరూ తీసుకోకపోవడంతో బస్తీవాసులు ఏకగ్రీవ తీర్మానం చేసి రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారని అధికారులకు తెలిపారు. షెడ్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి లేదా 18 షాపులను జీహెచ్ఎంసీ అధికారులు తీసుకొని ఆ షాపులను అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఆ డబ్బుతో బస్తీలో కరెంటు, నల్లా బిల్లులకు వినియోగించాలని కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంచి జరగటానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అహల్య, డీసీ రవీందర్‌కుమార్, ఎమ్మార్వో అహల్య, బస్తీ నాయకులు పాల్గొన్నారు.




అమృత తండాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రహదారుల విస్తరణ ఎప్పుడు?

- ప్రజా సొమ్ముతో సర్వేల పేరుతో కాలయాపన
- మెట్రో రహదారులకు హైటెన్షన్ విద్యుత్ లైన్ల రహదారుల అనుసంధానం చేయాలని డిమాండ్



ఆల్విన్‌కాలనీఫేజ్ వన్‌లో విద్యుత్ హైటెన్షన్ లైన్ రోడ్డును కబ్జా చేసిన స్థానికులు





జగద్గిరిగుట్ట కూకట్‌పల్లి వెళ్లే విద్యుత్ హైటెన్షన్ లైన్‌లో కార్ల పార్కింగ్

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ హైటెన్షన్ లైన్‌లు ఉన్న ప్రాంతాల్లో వాటికి అనుసంధానంగా రహదారులను విస్తరిస్తామని సుమారు దశాబ్ద కాలం క్రితం అప్పటి ఉమ్మడి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. అనంతరం తెలంగాణ రాష్ట్రంగా విడిపోయిన అనంతరం వచ్చిన టీఆర్‌యస్ ప్రభుత్వం వాటి వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.

◆ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, మాధవరం కాలనీ, సాయినగర్, జయానగర్, శంషీగూడ, భూదేవి హిల్స్, ధరణీనగర్ తదితర ప్రాంతాల నుంచి ఈ హైటెన్షన్ లైన్ విస్తరించి ఉంది. ఇందులో భాగంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద నుంచి కూడా వివిధ ప్రాంతాల నుంచి వెళ్లే మార్గాలను కలపటానికి మెట్రో అధికారులు చర్యలు తీసుకుంటామని సర్వేలు కూడా చేపట్టారు.

◆ త్వరలోనే రహదారుల విస్తరణకు ప్రణాళికలు ఏర్పాటు చేసి రహదారులను నిర్మించి ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్పిస్తామని ఆశలు కల్పించారు. కానీ ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదు. అంతేకాకుండా రహదారులను కూడా విస్తరించలేదు. చేసిన సర్వేలు కూడా నిష్ప్రయోజనాలే తప్ప ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు.

◆ రహదారుల విస్తరణలో భాగంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ హైటెన్షన్ లైన్ విస్తరించే ప్రాంతాల్లో ఉన్న ఇళ్లను కూడా తొలగించాల్సి వస్తే వారికి నష్టపరిహారం అందజేసి ఇళ్లను తొలగించి రోడ్డును విస్తరిస్తామని తెలిపారు. ఎవరికీ ఎలాంటి నష్టం జరగకుండా అన్ని రకాల ఆదుకుంటామని ప్రగల్భాలు పలికారు.

◆ ఈ రహదారులు విస్తరించకపోవడంతో నిత్యం కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ నుంచి కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ మీదుగా హైటెక్ సిటీకి ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కూకట్‌పల్లి, ఎల్లమ్మబండ మీదుగా జీడిమెట్ల ఇండస్ట్రీ ప్రాంతానికి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆల్విన్‌కాలనీ జగద్గిరిగుట్ట మీదుగా జీడిమెట్ల, రంగారెడ్డినగర్, మేడ్చల్ ఇండస్ట్రీలకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

◆ ఈ ప్రాంతంలోని ప్రధాన రహదారులు సింగిల్ వే ఉండటంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హైటెన్షన్ లైన్ రహదారులను విస్తరింపజేసి ప్రయాణికులకు సులభమైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెంటనే రోడ్లను విస్తరించాలి..



రహదారుల విస్తరణ లేకపోవటంతో కూకట్‌పల్లి, ఎల్లమ్మబండ, ఆల్విన్‌కాలనీ ప్రధాన రహదారులు ట్రాఫిక్ జామ్‌తో పాటు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయి. వెంటనే రోడ్లను విస్తరించాలి. ట్రాఫిక్ సమస్యను తీర్చాలి

– గోపాల్, ధరణీనగర్ సంఘం జనరల్ సెక్రటరీ

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి..



ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని విద్యుత్ హైటెన్షన్ లైన్ల రహదారులను విస్తరింపచేసి మెట్రో రహదారులకు అనువుగా ఏర్పాటు చేయాలి. గతంలో మెట్రో అధికారులు అనేకసార్లు కాలనీలోని హైటెన్షన్ రోడ్లను ప్రజా సొమ్ముతో సర్వేలు చేపట్టారు. ఆ ప్రణాళికలు తుంగలో తొక్కేశారు. ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులతో చర్చించి ఈ రహదారుల విస్తరణకు పూనుకోవాలి. ప్రజాప్రతినిధులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– కుమార్ యాదవ్, భూదేవిహిల్స్, ఆల్విన్‌కాలనీ

ఒకేసారి రెండు అకడమిక్ ప్రోగ్రాంలు ఎంతో మేలు

జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నరసింహారెడ్డి



కేపీహెచ్‌బీకాలనీ: జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం బీబీఏ ఇన్ డేటా అనలిటిక్స్‌ను ఏకకాలంలో బ్లెండెడ్ మోడ్‌తో పాటు చాయిస్ బేసెస్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్)లో అమలుపరిచేందుకు జేఎన్టీయూహెచ్ నిర్ణయం తీసుకుంది. కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్‌లోని యూసీసీ అకడమిక్ స్టాఫ్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం జరిగిన అటానమస్, నాన్ అటానమస్, కాన్‌స్టిట్యూయెంట్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా బీబీఏ–డీఏ ప్రోగ్రామ్‌ను పరిచయం చేయడంతో పాటు మార్గదర్శకాలను అందించారు. అలాగే ప్రిన్సిపాల్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఒకేసారి రెండు అకడమిక్ ప్రోగ్రామ్‌లను కొనసాగించడం పట్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనిపై అధ్యాపకులు మరింతగా అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ ఎం.మంజూర్ హుస్సేన్, ఎస్‌సీడీఈ డైరెక్టర్ కృష్ణమోహనరావు, డీఏపీ డాక్టర్ చంద్రమోహన్, జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ ప్రిన్సిపాల్ సింధు, ఎస్‌సీడీఈ డిప్యూటీ డైరెక్టర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఫర్ ఇండియా వ్యాసరచనలో సత్తాచాటిన శ్రీజ



విద్యార్థి శ్రీజకు నగదు పురస్కారం అందజేస్తున్న తపాల శాఖ ప్రతినిధులు, మదన్‌మోహన్‌రావు

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ తపాలా శాఖ నిర్వహించిన విజన్ ఫర్ ఇండియా 2047 పేరిట నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన అక్షర స్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. భవిష్యత్ భారతదేశం ఎలా ఉండనుందో ఊహించి తమ అభిప్రాయాలను వ్యక్త పరిచేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అక్షర స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రోహిత శ్రీజ మొదటి బహుమతి పొందింది.

◆ సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన పోస్ట్‌మాస్టర్, అక్షర స్కూల్ సీఈవో మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా శ్రీజకు రూ.25 వేల నగదు బహుమతిని అందజేశారు.అనంతరం విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జానకి, తపాలా శాఖ ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆస్తిపన్ను చెల్లించాలి

మోతీనగర్: ఆధార్ సీడింగ్, ఆస్తిపన్ను చెల్లింపులపై అల్లాపూర్ డివిజన్ ఏఎంసీ అధికారి సోమవారం వార్డు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సబిహా బేగంతో పాటు డీసీ రవికుమార్ పాల్గొన్నారు. ఆధార్ సీడింగ్, ఆస్తి పన్నులను సమయానికి చెల్లించడం లేదని డీసీ తెలిపారు. దీంతో కార్పొరేటర్ స్పందించి బస్తీ అధ్యక్షులను పిలిపించి మాట్లాడారు. ఓటర్‌కార్డుకు ఆధార్ సీడింగ్ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులకు సహకారం అందించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, బాబా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేజీఎన్ దర్గా వార్షికోత్సవం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పండిట్ నెహ్రూనగర్‌లోని కేజీఎన్ దర్గా వార్షికోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ప్రజలు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, కేజీయన్ దర్గా నిర్వాహకులు మోయిన్ పటేల్, నాయకులు సయ్యద్ నజీర్, మహమ్మద్ అజీమ్, రహీం, టి.వీరారెడ్డి, యోగిరాజ్, జ్ఞానేశ్వర్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతిపత్రాన్ని అందించారు. నేతాజీనగర్‌లో సీసీరోడ్డు, గోపన్‌పల్లి తండాలో వరదనీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లోని సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంచందర్‌యాదవ్, నాయకులు తిరుపతి, రాయుడు, బుచ్చయ్యయాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు

కూకట్‌పల్లి: సంఘమిత్ర డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు కూకట్‌పల్లి నైనా గార్డెన్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ నాయకులు మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. చైర్మన్ డాక్టర్ కొరదాల నరేష్ మాట్లాడుతూ... విద్యార్థులు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ కావాలని ఉన్నత పదవుల్లోకి రావాలని కోరారు. విద్యార్థులు తమ ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, కేవీ లావణ్య, మౌనిక, హరికృష్ణ, మీరావళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కమల ప్రసన్ననగర్ కాలనీ అభివృద్ధికి పాటుపడాలి

- అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే గాంధీ



ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమలప్రసన్ననగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. కాలనీ అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తిరుపతి, జనరల్ సెక్రటరీ శ్రీశైలం, జాయింట్ సెక్రటరీ బండప్ప, ట్రెజరర్ శివశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్ర ముగింపు



కూకట్‌పల్లి: భారత్ జోడో యాత్ర కాశ్మీర్‌లో ముగియనున్న సందర్భంగా రాహుల్ గాంధీకి సంఘీభావంగా సోమవారం కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాప్ వద్ద కాంగ్రెస్ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చలం, కృష్ణారెడ్డి, గాలి బాలాజీ, ప్రవీణ్, ఫణి, అరవిందరెడ్డి, కరీం, వసీమ్, రాజేంద్ర, రాజు, శోభారాణి, వరలక్ష్మి, వనజ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళులు

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో నాయకులు గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి గాంధీజీ అందించిన సేవలను వారు కొనియాడారు. నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి ప్రపంచ చరిత్రలోనే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని కొనియాడారు. బాపూజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు భావితరాలకు ఆదర్శమన్నారు.

– కూకట్‌పల్లి



గాయత్రినగర్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం



ఎల్లమ్మబండలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే జావిద్ ఆలీ



పాపిరెడ్డినగర్‌లో నివాళులర్పిస్తున్న బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తదితరులు



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య